క్లుప్తంగా

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): కులమతాలు, రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా సంక్షేమఫలాలు అందిస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. స్థానిక దుర్గాపురంలో మంగళవారం నూతనంగా మంజూరైన పింఛన్ల ఆమె లబ్ధిదారులకు అందజేశారు.

మెరుగైన సేవలందించాలి

పాయకాపురం(విజయవాడరూరల్): అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు, గర్భిణిలకు, బాలింతలకు మెరుగైన సేవలందించాలని 64వ డివిజన్ కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ అన్నారు. డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. కార్పొరేటర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన భోజనం, మెనూ ప్రకారం పోషక విలువలున్న ఆహారాన్ని అందించాలన్నారు.

రేపు హుండీ లెక్కింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 5వ తేదీన దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు, ధర్మకర్తలు, దేవదాయశాఖ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ఆలయంలో చోరీ చేసిన వ్యక్తికి ఏడాది జైలు

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ వన్‌టౌన్‌లోని కుసుమ హరినాథ మందిరంలో దొంగతనానికి పాల్పడిన అంతరాష్ట్ర నేరస్తుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ విజయవాడ చీఫ్ మెట్రోపాలిటిన్ కోర్టు న్యాయమూర్తి డి.సత్యవతి మంగళవారం తీర్పు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ తుకారంగేటు ప్రాంతానికి చెందిన ఆగోతు రాములునాయక్ 2021 నవంబర్ 26వ తేదీన ఆలయంలో చోరీకి పాల్పడ్డాడు. ఆ రోజు రాత్రి ఆలయం తాళాలు పగుల గొట్టి ఎనిమిది కేజీల వెండి మకర తోరణాన్ని అపహరించి పరారయ్యాడు. ఆలయ పురోహితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, అదే ఏడాది డిసెంబర్ 12వ తేదీన నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చాడు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్ కోర్టుకు వాదనలు వినిపించారు. 15 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు రాములునాయక్‌కు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.


నిబంధనల ఉల్లంఘనులకు జరిమానా



కేక్ కట్ చేస్తున్న న్యాయమూర్తి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ సర్కిల్–1 కార్యాలయంలో మంగళవారం న్యాయమూర్తి యు.రామమోహన్ మొబైల్ కోర్ట్ నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై సర్కిల్–1కు సంబంధించిన శానిటరీ ఇనస్పెక్టర్లు కేసులు నమోదు చేసిన 38 మందిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. వారిలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తులు, విచ్చలవిడిగా పశువులను రోడ్లపైకి వదిలేసేవారు, రోడ్లపై చెత్త వేసేవారు ఉన్నారు. వీరందరికీ కలిపి రూ.17,450 జరిమానా విధించిన న్యాయమూర్తి రామమోహన్‌రావు మరోసారి ఈ విధంగా నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నియంత్రణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. తొలుత నూతన సంవత్సరం సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. జోనల్ కమిషనర్–1 కేటీ సుధాకర్, హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్‌బాబు, శానిటరీ సూపర్‌వైజర్లు ఓబేశ్వరరావు, శివరామప్రసాద్, పాల్గొన్నారు.

బిషప్ జాన్ విక్టర్ మృతి



పాయకాపురం(విజయవాడరూరల్): 50 సంవత్సరాలుగా ఏసుప్రభువు సేవలో ఉన్న ఇవాంజిలికల్ చర్చ్ ఆఫ్ ఇండియా, నార్త్ ఆంధ్ర, తెలంగాణ బిషప్‌గా పనిచేసిన రెవరెండ్ డాక్టర్ బిషప్ జాన్ విక్టర్ (74) మంగళవారం విజయవాడలో మృతి చెందారు. విశ్వాసుల సందర్శనార్థం ప్రకాష్‌నగర్లోని శాంతినగర్ ఈసీఐ చర్చివద్ద ఆయన పార్థివదేహానికి నివాళులర్పించేందుకు భారీసంఖ్యలో క్రైస్తవులు తరలివచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



ముత్యాలంపాడులో మహిళా టీచర్స్‌కు సత్కారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్త్రీ విద్య, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప సంఘసంస్కర్త సావిత్రీబాయి పూలే అని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలోని గురుకుల కళాశాలలో మంగళవారం భారతీయ సంఘ సంస్కర్త, రచయిత్రి, మొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఆమె చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె బాలకృష్ణ, డాక్టర్ ధనలక్ష్మి, సుధారాణి, అరుణ మాట్లాడారు.

డిగ్రీ కళాశాలలో ఉమెన్స్ టీచర్స్‌డే..

మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా మంగళవారం నేషనల్ ఉమెన్స్ టీచర్స్‌డే కార్యక్రమం జరిగింది. డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీ శైలజ, నెల్లూరు సూళ్లూరుపేటకు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం బీ దేవదానమ్మ, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ బీ శుభ పాల్గొన్నారు.

ముత్యాలంపాడులో..

ముత్యాలంపాడులోని అజయ్ హైస్కూల్లో మంగళవారం నేషనల్ ఉమెన్స్ టీచర్స్‌డే పురస్కరించుకుని మహిళా టీచర్‌లకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన సత్కరించారు. తొలుత సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఏ లక్ష్మీఅపర్ణ పాల్గొన్నారు.

ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో..



ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళా సమాఖ్య ప్రతినిధులు



మాచవరం గురుకుల కళాశాలలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్త్రీ విద్య వికాసానికి కృషి చేసిన సంఘసంస్కర్త సావిత్రిభాయి పూలే నేటి మహిళా లోకానికి ఆదర్శమని సీపీఐ జాతీయ సమితి కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానీ పేర్కొన్నారు. సావిత్రి పూలే జయంతి కార్యక్రమం ఏపీ మహిళా సమాఖ్య నగర సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, అధ్యక్షురాలు ఓర్సు భారతి, మాజీ కార్పొరేటర్ తమ్మిన దుర్గ తదితరులు పాల్గొన్నారు.

తొలితరం ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళల హక్కుల కోసం పోరాటాలు చేసిన తొలితరం ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు చిప్పాడ చందు అన్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతులు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. మహిళా హక్కుల కోసం పోరాటలు చేసిన సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆదేశాల మేరకు మంగళవారం పాత బస్టాండ్ సమీపంలోని సంఘ కార్యాలయంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. సంఘ ప్రధాన కార్యదర్శి రంగబాబు, వంగర రవి, సూరి, రఘు, పవన్, వెంకట్ పాల్గొన్నారు.

మహిళల కోసం పోరాడిన సావిత్రిబాయి పూలే

పాయకాపురం(విజయవాడరూరల్): మహిళల హక్కుల కోసం పోరాడిన సావిత్రిబాయి పూలే గొప్ప మహిళాభ్యుదయ వాది, సంఘసంస్కర్త అని ఐద్వా సెంట్రల్ కార్యదర్శి జి.ఝాన్సీ అన్నారు. ఐద్వా సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రకాష్‌నగర్లోని ఎంహెచ్ భవన్‌లో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో విజయలక్ష్మీ, కల్పన, పద్మావతి, రత్నకుమారి పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చందు, రంగబాబు



సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఐద్వా మహిళలు

సావిత్రిబాయి పూలే సాహసం మహిళలకు ఆదర్శం

ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళలు విద్యావంతులైతేనే సమాజంలో మార్పు తీసుకురాగలమనే లక్ష్యంతో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా భాధ్యతలు చేపట్టి మహిళలను చైతన్యవంతులుగా చేసిన సావిత్రిబాయి పూలే నేటి మహిళలకు ఆదర్శప్రాయంగా నిలుస్తారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి అన్నారు. మంగళవారం గాంధీనగర్ లేపాక్షి కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. చైర్‌పర్సన్ విజయలక్ష్మి ఎండీ బాలసుబ్రహ్మణ్యంతో కలిసి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల బాలికల కోసం పాఠశాలలను ప్రారంభించారన్నారు. సావిత్రిబాయి పూలేను నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. సావిత్రి బాయి పూలేకు నివాళులు అర్పించిన వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం, ఓఎస్‌డీ లక్ష్మినాథ్, మేనేజర్లు ఎస్.శ్రీధరాచారి, ఎం.సురేష్, సీహెచ్ ఎస్ నరసింహరావు, పి.వాసుదేవరావ్, సిబ్బంది పి. ఉమామహేశ్వరరావు, భారతి, సుధ, కిశోర్, రాజు, పవన్, చంద్రశేఖర్, రాజేష్, నరేష్, శ్యామల, మురళిబాబు పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విజయలక్ష్మి

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



సంక్షేమ పథకాల బ్రోచర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు. చిత్రంలో డిప్యూటీ మేయర్ శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్ లక్ష్మీపతి

ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమం వెల్లివిరుస్తోందని, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. స్థానిక 29వ డివిజన్ 209వ వార్డు సచివాలయం పరిధిలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, నగరపాలక సంస్థ అధికారులు, వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి గడప గడపకూ వెళ్లి స్థానిక సమస్యలను తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ బ్రోచర్లను పంపిణీ చేశారు.

మధురానగర్ సర్వతోముఖాభివృద్ధికి కృషి

తనకు మధురానగర్‌తో ప్రత్యేకమైన అనుబంధం ఉందని మల్లాది విష్ణు పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉండగా అప్పటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో రూ.కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశామన్నారు. ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మధురానగర్ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ పింఛన్

గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో 17వేల పింఛన్లు మాత్రమే ఉండగా, తాము అధికారంలోకి వచ్చాక 25,554కు పెంచామన్నారు. ఈ ఒక్క నెలలోనే 1,074 మందికి నూతన పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. గతంతో పోలిస్తే సుమారు పది వేల పింఛన్‌లు అధికంగా వారి ఇంటివద్దనే ఇస్తున్నామన్నారు.

ఇంటి పట్టాల సమస్య పరిష్కారానికి కృషి

మధురానగర్ నేతాజీ కాలనీ, కొబ్బరితోట ప్రాంత ప్రజల ఇంటి పట్టాల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

టీడీపీ ఆర్భాటాలకు అమాయకుల ప్రాణాలు బలి

టీడీపీ ప్రచార ఆర్భాటాలకు అమాయకుల ప్రాణాలు బలిగొంటున్నారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పుష్కరాలలో 29మంది, కందుకూరు ప్రచార సభలో ఎనిమిది మంది, గుంటూరులో ముగ్గురు మరణించేందుకు చంద్రబాబే కారణం అన్నారు. చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చి పీక్స్‌కు చేరిందన్నారు. కనీస పశ్చాత్తాపం లేకుండా దేవినేని ఉమా, బోండా ఉమా ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారన్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించడంలోను నీచ రాజకీయాలు చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు మరోసారి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ జీ సృజన పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థి ఎంపిక

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాల విద్యార్థి కిల్లారి శైలేంద్రకుమార్ జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పొద్దుటూరులో జరిగిన 66వ స్కూల్ గేమ్స్ అండర్–14 విభాగంలో ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన కిల్లారి శైలేంద్రకుమార్ అత్యుత్తమ ప్రదర్శనతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో శైలేంద్ర అభినందన కార్యక్రమం జరిగింది. పాఠశాల హెచ్‌ఎం సూర్యప్రభ, ఉపాధ్యాయులు ఎంజీపీ కుమార్, ఎం శ్రీనివాసరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు శైలేంద్రను సత్కరించారు.



శైలేంద్రను అభినందిస్తున్న హెచ్‌ఎం సూర్యప్రభ, శ్రీనివాసరెడ్డి, వెంకట్రావు

క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సొంగా సరళకుమారి సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం యోగా పోటీలలో విజేతగా నిలిచిన షాలేమ్‌రాజు అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల్లో కాకినాడలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన యోగా పోటీలలో తమ కళాశాల విద్యార్థి షాలేమ్‌రాజు ప్రథమ స్థానం సాధించడం కళాశాలకే గర్వకారణం అన్నారు. అనంతరం షాలేమ్‌రాజు, అతని తల్లి మార్తమ్మను అభినందించారు.



షాలేమ్‌రాజును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సరళకుమారి

చట్టసభల్లో బీసీలకు 50 శాతం వాటా ఇవ్వాలి

- బీసీల దిశ–దశ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చట్ట సభల్లో బీసీలకు 50 శాతం వాటా ఇవ్వడంతో పాటు అన్ని నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సావిత్రి బాయి పూలే 192వ జయంతిని పురస్కరించుకుని బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం చిట్టినగర్‌లోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో 'బీసీల దిశ–దశ' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు. బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఎన్వీ రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీజేఆర్ నారగోని, వినుకొండ సుబ్రహ్మణ్యం, మాజీ డెప్యూటీ మేయర్ గోగుల వెంకట రమణ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నమ్మి అప్పారావు, కోశాధికారి అవ్వారు బుల్లబ్బాయ్ హాజరయ్యారు. తొలుత సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల జనగణన వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీపీఎస్సీ, టీపీఎస్సీ సభ్యుల నియామకాలలో బీసీ రిజర్వేషన్ పాటించాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో వైస్ చాన్సలర్లు, రిజిస్ట్రార్ల నియామకాలలో రిజర్వేషన్ పాటించాలని కోరారు. జనాభా ప్రాతిపదికన నిధులిచ్చి ఈసీల ఉప ప్రణాళికను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు జవ్వాది కూర్మాచారి, బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు బుద్దా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బాయన శేఖర్ బాబు, చాత్తాడ శ్రీవిష్ణువు, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు టి.శోభనాద్రి, తమ్మిశెట్టి చక్రవర్తి, బీసీ సంక్షేమ సంఘ నాయకురాలు నూకాలమ్మలతో పాటు కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున బీసీ సంఘ నేతలు సమావేశంలో పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు

సంక్షేమంలో ఆదర్శంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో రేషన్ కార్డులు లేవని ఆయనకు విన్నవించుకున్న నియోజకవర్గంలోని 14 మందికి ఆయన రెవెన్యూ అధికారులతో మాట్లాడి వారికి కార్డులు మంజూరయ్యేలా చూశారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ నూతనంగా రేషన్ కార్డులు మంజూరయ్యాయి. సింగ్ నగర్ ఆంధ్రప్రభకాలనీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే విష్ణు వారికి మంగళవారం రేషన్ కార్డులను అందజేశారు.

రూ.5.30 లక్షల విలువైన ఎల్‌ఓసీ పత్రం అందజేత

స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీకి చెందిన సయ్యద్ రసూల్(9) పుట్టుకతోనే వినికిడి సమస్యతో బాధపడుతున్నారు. బాలుడి ఆర్థిక దుస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే విష్ణు విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5.30 లక్షల విలువైన ఎల్‌ఓసీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపారు. ఎమ్మెల్యే విష్ణు తన కార్యాలయంలో మంగళవారం బాలుడి తండ్రి ఎస్టీ బాబుకి ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు.



నూతన రేషన్‌కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక ఆసరా

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోం గార్డు యూనిట్ నందు హోం గార్డుగా విధులు నిర్వర్తిస్తూ గత ఏడాది అక్టోబర్ 26వ తేదీన గుండె పోటుతో మృతి చెందిన మధురై సౌందరరాజు కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును పోలీస్ కమిషనర్ టి.కె.రాణా అందజేశారు. మృతుడు సౌందరరాజు కుటుంబానికి ఆర్థిక ఆసరా కల్పించేందుకు కమిషనరేట్ పరిధిలోని హోంగార్డులు వారి ఒక్క రోజు వేతనాన్ని సేకరించారు. ఈ నగదు చెక్కును మృతుడు భార్య మహాలక్ష్మికి సీపీ రాణా మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, హోంగార్డ్స్ ఆర్ఐ కృష్ణ పాల్గొన్నారు.



దుర్గాపురంలో అగ్నిప్రమాదం

- రూ.3 లక్షల ఆస్తినష్టం



దగ్ధమైన గృహోపకరణాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురంలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో మూడు పోర్షన్లు దగ్ధం కాగా సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం సంభవించింది. వివరాలలోకి వెళితే దుర్గాపురం సాంబమూర్తి రోడ్డులో పురమా రాంబాబుకు చెందిన ఐదు పోర్షన్ల నివాసంలోని ఒక పోర్షన్‌లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు వెంకటేష్ నివసిస్తున్నారు. ఈయన మంగళవారం మధ్యాహ్నం ఫాస్ట్ ఫుడ్ సెంటర్ కోసం మంచూరియా తయారు చేస్తున్న సమయంలో వంట పాత్రలోని నూనెకు మంటలు అంటుకున్నాయి. దీంతో ఆయన మంటలు అదుపు చేసేందుకు నీళ్ల పోశాడు. దీంతో మంటలు ఎగిసి పడి ఇంట్లోని వస్తువులు, తారు రేకులకు అంటుకున్నాయి. మంటలు ఒక్కసారిగా విజృంభించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. స్థానిక కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు కె.రాము, బ్రహ్మదేశం వసంతకుమార్ తదితరులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఐదు పోర్షన్లలో మూడు అగ్నికి ఆహుతి కాగా సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం సంభవించింది



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

అగ్నిప్రమాద బాధితులను ఎమ్మెల్యే మల్లాది విష్ణు పరామర్శించారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ మల్లీశ్వరి, బలరామ్ పాల్గొన్నారు.

9న ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటీస్ మేళా

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో ఈ నెల తొమ్మిదో తేదీన అప్రెంటీస్ మేళాను నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై విద్యార్థుల అర్హతలను బట్టి వారి కంపెనీల్లో అప్రెంటీస్‌కు అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో అన్ని ట్రేడ్‌ల్లో ఐటీఐ పూర్తి చేసినవారు ఈ మేళా పాల్గొనవచ్చని తెలిపారు. విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటుగా ఒక సెట్ జిరాక్సు పత్రాలు, పాస్‌పోర్ట్ ఫొటోతో అప్రెంటీస్ మేళాకు హాజరుకావాలని పేర్కొన్నారు. తొమ్మిదో తేదీ ఉదయం 9 గంటల నుంచి మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 0866–2475575, 83094 42698లో సంప్రదించాలని ఆయన కోరారు.

కలువపూలతో స్వామికి అర్చన



స్వామివారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో మంగళవారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామికి కలువపూలతో విశేషంగా అర్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న గ్రామంలో చినకంచి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గున్నం సుబ్బులు(40) అనే మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు బాపట్లకు చెందిన గున్నం మహలక్ష్మయ్య, అతని భార్య సుబ్బులు నున్న గ్రామంలో భీమవరపు వెంకటరెడ్డి మామిడితోటలో కాపలా ఉంటున్నారు. ఇంట్లోకి కావాల్సిన సరుకులు గ్రామానికి వచ్చి కొనుగోలు చేసి టీవీఎస్ ఎక్సెల్‌పై ఇద్దరు తిరిగి వెడుతుండగా చినకంచి వద్ద ఎదురుగా వస్తున్న లారీ మార్జిన్ వైపు రావడంతో ఇద్దరు పడిపోయారు. రోడ్డు వైపు పడిపోయిన సుబ్బులు తలపై లారీ ముందు టైరు ఎక్కడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. భర్త మహలక్ష్మయ్య చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుబ్బులు